ప్రజాశక్తి

మంగళవారం 5 డిసెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తీవ్ర తుపానుతో అలజడి



ఆర్‌కె.బీచ్‌లో ఎగిసిపడుతున్న అలలు

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఎయిర్ పోర్టు నుంచి నిలిచిన విమాన రాకపోకలు

నేడు కూడా స్కూళ్లకు సెలవు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మిచౌంగ్ తుపాను తీవ్రత పెరగడంతో విశాఖ నగరంలో జన జీవనం జలజీవనంగా మారింది. పలు రైళ్ల రద్దయ్యాయి. విమానాల రాకపోకలు విశాఖ నుంచి రద్దుచేశారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సముద్రం పూర్తిగా కల్లోల వాతావరణం అలముకుంది. అలలు పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్నాయి. టూరిస్టులు సైతం సాగర తీరానికి సోమవారం రాలేకపోయారు. సోమవారం విశాఖలో ఉష్ణోగ్రతలు 22 డిగ్రీలకు పడిపోయాయి. భీమిలి 5, కాపులుప్పాడ 5, పరదేశిపాలెం 5, సాగర్‌నగర్ 4, పెదగంట్యాడ 4, మహారాణి పేట 3 సీతమ్మ ధారలో 3, విశాఖ జిల్లా గ్రామీణ ప్రాంతంలోనూ సరాసరి 5 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఎపిలోని బాపట్ల -మచిలీపట్నం వద్ద మంగళవారం మధ్యాహ్నం తుపాను తీరం దాటనుండడంతో మంగళవారం అంతా అతి భారీ వర్షాలు ఎపిలోని పలుచోట్ల కురవనున్నాయి. దీంతో ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. విశాఖ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు మంగళవారం కూడా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సెలవు

మిగతా 2లో..

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

మిచౌంగ్ తుపాన్ వల్ల గాలులు, వర్షాలు పడి పంటలు తడిసి నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్‌చేశారు. ఒకవైపున కరువు, మరోక వైపున అకాల తుపాను వల్ల రైతులు అనేక ఇక్కట్లు పడుతున్నారని పేర్కొన్నారు. తుపాను సహాయక చర్యలు చేపట్టి ప్రజలకు బాసటగా నిలవాలని కోరారు.

వరిపంట నేలమట్టం

ఆందోళనలో రైతులు

అనకాపల్లి జిల్లా యంత్రాంగం అప్రమత్తం



యలమంచిలిలో గాలికి పడిపోయిన వరి పంట

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, యలమంచిలి రూరల్, బుచ్చెయ్యపేట, మునగపాక

మిచౌంగ్ తుపాను ప్రభావంతో అనకాపల్లి జిల్లా అంతటా వర్షాలు ఎడతెరిపిలేకుండా పడుతున్నాయి. ఆదివారం ఉదయం 8.30 నుంచి సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు 11.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 6.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా ఎన్.రాయవరం మండలంలో 21.7 మిల్లీమీటర్ల వర్షం పడగా, అతి స్వల్పంగా నాతవరం మండలంలో 3.5 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లాలోని 24 మండలాల్లో వర్షం కురవడంతో వరి పంటలపై కొంత ప్రభావం పడింది. ఈదురుగాలులతో అనేక ప్రాంతాల్లో వరి పంట నేలమట్టమైంది. జలాశయాల కింద సాగైన వరి పంట ఎక్కువ భాగం వర్షాలకు తడుస్తోంది. యలమంచిలి కల్కి పెట్రోల్ బంకు సమీపంలోని వరి పొలాలు గాలులకు పడిపోయాయి. మరో

మిగతా 2లో..

శారదా నదిలో మునిగి ఇద్దరు మహిళలు మృతి

▶ వార్త మెయిన్‌లో..

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తం : సిఎమ్‌డి

▶ వార్త మెయిన్‌లో..

లెజెండ్స్ మ్యాచ్ రద్దు క్రికెటర్లు సూరత్‌కు పయనం

▶ వార్త మెయిన్‌లో..

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

▶ వార్త 8లో..

అప్రమత్తంగా ఉన్నాం

64 చోట్ల షెల్టర్లు ఏర్పాటు

తుపాను రక్షణ చర్యలపై ముఖ్యమంత్రికి వివరించిన కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మిచౌంగ్ తుపాను పట్ల అప్రమత్తంగా ఉన్నామని, అన్ని రకాల రక్షణ చర్యలూ చేపట్టామని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వివరించారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు, సమాచారం అందించేందుకు ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని, 64 చోట్ల తుపాను షెల్టర్లు ఏర్పాటుచేసి మౌలిక వసతులు కల్పించామని వివరించారు. తుపాను రక్షణ చర్యలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. విశాఖ నుంచి జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలో చేపట్టిన చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, వర్షపాత నమోదు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేస్తున్నామని చెప్పారు. జివిఎంసి పరిధిలో 37 లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను తరలించేందుకు 34 తుపాను షెల్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణం పరిధిలో 23 లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను తరలించేందుకు 30 షెల్టర్లను ఏర్పాటుచేసినట్లు వివరించారు. రెండు ఎన్‌డిఆర్‌ఎఫ్, రెండు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు పంటను తరలించాలని, కోతలను వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించినట్లు వివరించారు. జివిఎంసి పరిధిలోని 8 జోనల్ కార్యాలయాల్లో 24 గంటలూ సేవలందించేలా కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు

మిగతా 2లో..

సిపిఎంపై తప్పుడు ప్రకటనలు మానుకోవాలి

పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి : కరుణా ఆక్వాఫామ్ మేనేజింగ్ పార్టనర్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తండ్రి అన్నంరెడ్డి సత్యన్నారాయణ ఈ నెల 3వ తేదీన సిపిఎం నాయకులపై నిరాధారమైన వ్యాఖ్యలు చేయడాన్ని పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తీవ్రంగా ఖండించారు. తాను, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యన్నారాయణ కలిసి ప్రజల సమస్యలపై వాడ చీపురుపల్లిలో పర్యటించిన సందర్భంగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. చీపురుపల్లి తూర్పు ఖండం రెవెన్యు సర్వే నెంబర్ 297లో 11.97 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమంగా జరుపుతున్న గ్రావెల్ తవ్వకాల ప్రాంతాన్ని సందర్శించామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తండ్రి పేర్కొన్న 466, 467, 468, 476 సర్వేనెంబర్లు గల భూముల్లో తాము పర్యటించలేదని, అయినా ఎమ్మెల్యే తండ్రి అవాస్తవాలతో పత్రికా ప్రకటన విడుదల చేయడం సరికాదని పేర్కొన్నారు. తాము పర్యటనకు వెళ్ళినప్పుడు అక్కడ ఎవరూ లేకపోయినా ఉన్నట్లు సృష్టించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. గ్రావెల్ అక్రమ తవ్వకాల వల్ల సర్వేనెంబర్ 476లోని 59 ఎకరాల ప్రభుత్వ వాగు (ఉప్పుటేరు)ను కప్పివేయడం నిజం కాదా? ఆ అక్రమ తవ్వకాలను ఎవరైనా సందర్శిస్తారని ట్రంచ్ కొట్టి ముల్లుపొదల్లు వేసింది వాస్తవం కాదా? తూర్పు ఖండం రెవెన్యూకు చెందిన సర్వే నెంబర్ 319లో సామలకొండకు, పశ్చిమ ఖండం రెవెన్యూకు చెందిన సర్వే నెంబరు 464లో పొట్టిమెట్టకు మధ్యలో ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు రెవెన్యు అధికారులు మందలించలేదా? అని ప్రశ్నించారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాల వల్ల ఉప్పుటేరు పూర్తిగా మూసుకుపోతే వరదలు, వర్షాలు వచ్చినప్పుడు ఆ చుట్టు పక్కల భూములు కోతకు గురవుతాయని, ఎగువన ఉన్న 3 గ్రామాల ప్రజలు వరద ముప్పుకు గరయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ప్రభుత్వ భూములు, కొండలను కాపాడాల్సిన ఎమ్మెల్యే తండ్రి దానికి భిన్నంగా వ్యవహరిస్తూ సిపిఎం మీద దాడి చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. వర్షం నీరు సముద్రంలోకి వెళ్లాల్సిందిపోయి వీరు చేస్తున్న నిర్వాకం వల్ల ఈ ప్రాంతం వరదల్లో చిక్కుకొనే ప్రమాదం పొంచి ఉందని వివరించారు. తక్షణమే ప్రభుత్వం, అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

మొదటి పేజీ తరువాయి..

తీవ్ర తుపానుతో 'అల'జడి

ప్రకటించారు.

పెరగనున్న గాలుల వేగం, వర్షపాతం..

సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం అప్పటికే గడచిన 6గంటల్లో 10 కి.మీ వేగంతో వాయువ్య దిశగా తుపాను కదులుతూ బలపడి కేంద్రీకృతమైంది. నెల్లూరుకు ఆగ్నేయంగా 150 కి.మీ దూరంలోనూ, పుదుచ్చేరికి ఈశాన్యంగా 200 కి.మీ దూరంలోను, బాపట్లకు ఆగ్నేయ దిశగా 250 కి.మీ దూరంలోను, మచిలీపట్నానికి 280 కి.మీ దూరంలోనూ తుపాను సోమవారం సాయంత్రానికి కేంద్రీకృతమై ఉంది. మంగళవారం నాటికి ఎపిలోని నెల్లూరు, మచిలీపట్నానికి సమాంతరంగా ప్రయాణాన్ని సాగిస్తూ తీవ్ర తుపానుగా బాపట్లకు దగ్గర్లోనే తీరం దాటే అవకాశాలు ఉన్నాయి. ఈ తీరం దాటే సమయంలో స్థిరంగా గంటకు 110 నుంచి 115 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని తెలుస్తోంది. ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో భారీగా, దక్షిణ కోస్తాలో అతిభారీ వర్షాలు కురియనున్నాయి. రాయలసీమలోనూ మరింత తీవ్ర భారీ వర్షాలు మంగళవారం కురియనున్నాయి. గాలుల వేగం కూడా పెద్ద ఎత్తున పెరగనుంది. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకే పరిమితం కావాలంటూ రాష్ట్ర ప్రకృతి విపత్తుల సంస్థ ప్రకటించింది.

లోతట్టు ప్రాంతాల్లో అలజడి...

తుపాను, వర్షాలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు నిత్యం అవస్థలు పడాల్సిందే. విశాఖలోని లోతట్టు ప్రాంతాల ప్రజానీకంపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టిసారించింది. సోమవారం నాటికే మాధవదార, కెఆర్‌ఎం కాలనీ, చంద్రానగర్ తదితర చోట్ల ఇళ్లల్లోకి నీరు వచ్చింది. కొండలపై నివాసం ఉండే ప్రజల ఇళ్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. జలపాతంలాగ కొండలపై నుంచి జారిపడుతున్న నీరు రోడ్లపైకి నేరుగా వచ్చేస్తూ రోడ్లన్నీ జలమయం అయిపోయాయి. చెరువులు, గెడ్డలను నగరంలో కప్పివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కొండలపై నుంచి జారిపడుతున్న నీటి వల్ల ఇళ్ల పునాదుల కిందకు నీటిపడును వెళ్తోంది. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడే అవకాశాలున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం ఈ దిశగా కూడా అప్రమత్తం చేస్తోంది.

ఎయిర్ పోర్టు నుంచి పలు విమానాలు రద్దు...

సహాయక చర్యల్లో తూర్పునౌకాదళం కూడా చెన్నయ్, ఏపి కోస్తా తీరాల్లో యుద్ధనౌకలతో మానవ సహాయ చర్యలకు సిద్ధమైంది. విశాఖ ఎయిర్ పోర్టు నుంచి పలు విమానాలను రద్దుచేస్తూ ఎయిర్ పోర్టు డైరెక్టర్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ–విశాఖపట్నం, విశాఖపట్నం –తిరుపతి, తిరుపతి –విజయవాడ, విశాఖపట్నం –విజయవాడ, విశాఖ–చెన్నయ్, హైదరాబాద్ –విశాఖపట్నం ఫ్లైట్స్ అన్నీ పూర్తిగా రద్దయ్యాయి. మంగళవారం వరకూ ఇదే పరిస్థితి కొనసాగనుంది.

వరిపంట నేలమట్టం

పది రోజుల్లో కోయాల్సిన వరి పంట గాలులకు నేలమట్టంకావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి, బుచ్చెయ్యపేట, మునగపాక సహా అనేక మండలాల్లో వరి చేను నేలకొరిగింది. భారీ వర్షం పడితే ఈ పంట నీటమునిగి పాడవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడా కోసిన వరిచేను పదునుగా ఉండడంతో కుప్పలు వేయలేదు. కోసి, కుప్పలు వేయని చేను వర్షానికి తడుస్తోంది. దీనివల్ల ధాన్యం నాణ్యత, దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 9,727 ఎకరాల్లో వరి పంట రైతులు కోశారు. 262 ఎకరాల్లో కోసిన వరిచేను తరలించారు. 8,732 ఎకరాల్లో కుప్పలు వేశారు. నూర్పుచేసి 1255 మెట్రిక్ టన్నుల ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు ఇవ్వాలని ఆదేశించారు.

తుపానుతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. మండల స్థాయిలో బృందాలను నియమించారు. గాలులతో కూడిన వర్షాలు పడనున్నందున పడిన చెట్లను తొలగించేందుకు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని వైద్య, ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేశారు. సోమవారం ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఆర్‌డిఒ, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటుచేశారు. మండల ప్రత్యేకాధికారులు, నియోజకవర్గ అధికారులకు గ్రామాల్లో పారిశుధ్యం సమస్య, ప్రజలకు అసౌకర్యంలేకుండా చూసే పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. జిల్లా కలెక్టరేట్‌లో సమాచారం తీసుకొనేందుకు ఫోన్ నెంబరు ఏర్పాటుచేశారు. 08924222888, ఈ మెయిల్ droanakpalli@gmail.com, droakpco-ordn@gmail.com కు సమాచారం పంపించవచ్చు.

అప్రమత్తంగా ఉన్నాం

చేశామని తెలిపారు. తీర ప్రాంత రక్షక దళాలతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిస్థితిని గమనిస్తున్నామని, తగిన చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉన్నామని పేర్కొన్నారు.

22న విజెఎఫ్ ఎన్నికలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం (విజెఎఫ్) ఎన్నికలు ఈ నెల 22న జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల అధికారి బి.ప్రభాకర్ శర్మ సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. 2012లో ఆఖరి సారిగా విజెఎఫ్ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో ఎన్నికైన పాలకవర్గం రెండేళ్ల పదవీకాలం తర్వాత, పదవి నుంచి వైదొలగవలసి ఉన్నప్పటికీ, కోర్టు కేసులు, కరోనా వంటి కారణాలతో ఎన్నికలను నిర్వహించలేదు. ఎన్నికల నిర్వహణకు ఈ పాలకవర్గం చేసిన ప్రయత్నాలు, కొందరు జర్నలిస్టులు లేవనెత్తిన అభ్యంతరాలు నేపథ్యంలో ఫలించలేదు. ఆఖరికి ప్రభుత్వం, పాలకవర్గాన్ని రద్దుచేసి, విజెఎఫ్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం నియమించిన అధికారుల కమిటీ, పలు రకాల సమీక్షలు జరిపిన నేపథ్యంలో, సభ్యుల జాబితాను ఖరారు చేసింది. 520 మంది సభ్యుల జాబితాను ఖరారు చేసి నోటీసు బోర్డులో సోమవారం ప్రకటించారు. వీరందరూ, సంవత్సరానికి రూ.60 చొప్పున 8 సంవత్సరాలకు కలిపి రూ.480 సభ్యత్వ రెన్యువల్ సొమ్ము చెల్లించి, ఓటు హక్కు కలిగిన సభ్యులుగా గుర్తింపు పొందాల్సి ఉంటుంది. అటువంటివారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు, ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికలు ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో జరుగుతాయని, ఆ వెంటనే ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారితో పాటు, 6 కార్యవర్గ సభ్యుల పోస్టులకు ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. నామినేషన్ పత్రాలను ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోగా సమర్పించవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 11, 12 తేదీలలో నామినేషన్ల పరిశీలన, 13న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. పోటీదారుల తుది జాబితాను 14వ తేదీన ప్రకటిస్తామని వివరించారు. ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునే సభ్యులు, వారు సభ్యత్వం రెన్యువల్ కోసం డబ్బు చెల్లించిన అసలు రసీదు, ఏదో ఒక ప్రభుత్వ గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

జంతర్ మంతర్ ధర్నాలో కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దళితుల రాజ్యాంగ హక్కులు, ఆర్థిక, భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా నుంచి వెళ్లిన కెవిపిఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారిలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బన్న, కార్యదర్శి టి.చిరంజీవి, ఉపాధ్యక్షుడు ఎం.వి.ప్రసాదరావు, జాతీయ కమిటీ సభ్యులు భాగం లక్ష్మి, ఎం.సుబ్బారావు, బి.రత్నం, విజయ, చిట్టిరాణి తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్న విశాఖ జిల్లా నాయకులు

దేశీయ విత్తనాల మార్పిడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : శివాజీపాలెంలోని గోఆధారిత ప్రకృతి రైతుల సంఘం కార్యాలయంలో సోమవారం విత్తనాలు ఇచ్చి పుచ్చుకునే కార్యక్రమాన్ని గ్రీన్ క్లైమేట్ ఆధ్వర్యాన నిర్వహించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణమూర్తి, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం ఇచ్చి పుచ్చుకునే విధానంలో దేశీయ విత్తనాలు మార్పిడిచేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ మాట్లాడుతూ, పూర్వం విత్తనాలు సేకరించే పద్ధతిని భవిష్యత్తు తరాలకు అందించటానికి అంతా కృషి చెయ్యాలని చెప్పారు. విత్తన క్షేత్రాలు, విత్తనాల గ్రామాలనూ పునరుజ్జీవింప చేయాలని కోరారు. కార్యక్రమంలో జలగం కుమారస్వామి, సుబ్రహ్మణ్యవర్మ పాల్గొన్నారు.

10న జర్నలిస్టుల వనసమారాధన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్తంగా ఈ నెల10వ తేదీన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులతో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాఖ్య జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అర్బన్ అధ్యక్షుడు పి.నారాయణ్ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, శివాజీ పార్కు (యోగా ఆడిటోరియం)లో ఆదివారం ఉదయం 9 గంటలకు అల్పాహారంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు, లక్కీడిప్ కార్యక్రమం, అతిథుల ప్రసంగాలు, సీనియర్ పాత్రికేయుల సత్కారం, విందు భోజనంతో పాటు రకరకాల ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు కార్తీక వనసమారాధనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాసరావు, ఎపి బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.మురళీకృష్ణ, బొప్పన రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, ఎ.సాంబశివరావు, మధురవాడ యూనియన్ ప్రతినిధి డి.ఆనందరావు పాల్గొన్నారు.

వితంతు, వృద్ధుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళల పెన్షన్లను రూ.6 వేలకు పెంచాలని, విభిన్న ప్రతిభావంతుల పెన్షన్ నెలకు రూ.7 వేలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జివిఎంసి పరిధిలో ఉన్న 172 సచివాలయ కార్యదర్శులకు సోమవారం వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.వనజాక్షి, ఎమ్‌డి బేగం మాట్లాడుతూ వయోవృద్ధులు గౌరవప్రదంగా జీవించడానికి తగినంతగా పెన్షన్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. 2007 తల్లిదండ్రుల పోషణ, వృద్ధుల సంరక్షణ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి తగు రక్షణ కల్పించాలని కోరారు.

విశాఖలో స్కూజో ఐస్ 'ఓ' మ్యాజిక్ అవుట్‌లెట్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : స్కూజో ఐస్ 'ఓ' మ్యాజిక్ విశాఖపట్నంలో బీచ్ రోడ్, ద్వారకానగర్ ప్రాంతాల్లో కొత్త ఫ్రాంచైజ్ అవుట్‌లెట్లను సోమవారం ప్రారంభించింది. బీచ్ రోడ్ ఫ్రాంచైజీని ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, చమర్తి ఇన్‌ఫ్రా ఎమ్‌డి జయలక్ష్మి ఏజెన్సీస్ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఎంకెఎస్ అసోసియేట్స్ న్యాయవాది ఎం.సత్యవెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూజో ఐస్ 'ఓ' మ్యాజిక్ వ్యవస్థాపకుడు డైరెక్టర్ గగన్ ఆనంద్ మాట్లాడుతూ, విశాఖపట్నంలో కొత్త శాఖలతో నగరంలో ప్రజలకు స్వీట్లు, డెజర్ట్‌ల ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

ఆర్ఆర్ఆర్‌తో కాలుష్య నియంత్రణ

ఎన్ఎస్‌టిఎల్‌లో స్వచ్ఛత అవగాహన దినోత్సవం



స్వచ్ఛత పక్వాడాలో ఉద్యోగులతో ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్

ప్రజాశక్తి -కరాస: కాలుష్య స్థాయిలను అదుపులో ఉంచేందుకు ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందనిఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ అన్నారు. సోమవారం ఎన్ఎస్‌టిఎల్‌లో స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ మానవునిశ్రేయస్సు, మనస్సు, ఆరోగ్యాన్ని భౌతిక, ఆధ్యాత్మికపరంగా నిర్థారించేందుకు జీవితంలో స్వచ్ఛత చాలా ముఖ్యమైన అంశమన్నారు. స్వచ్ఛభారత్ కలను సాకారంలో ఉద్యోగులు చురుకైన భాగస్వామ్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్‌డాస్, గ్రూప్ డైరెక్టర్ సిహెచ్‌వి.సత్య శ్రీనివాస్, ఇతర శాస్త్రవేత్తలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనలో అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న జెడ్‌సి మల్లయ్యనాయుడు

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి ఎనిమిదో జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు తొమ్మిది అర్జీలు వచ్చాయని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. టౌన్‌ప్లానింగ్, వైద్యఆరోగ్యశాఖకు సంబంధించి చెరో మూడేసి అర్జీలు రాగా, రెవెన్యూ, విద్యుత్, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. సంబంధిత అర్జీలను పరిశీలించి, పరిష్కారానికి సంబంధిత విభాగాలకు రిఫర్ చేసినట్లు జెడ్‌సి తెలిపారు.

స్పందనకు తొమ్మిది అర్జీలు

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పలు సమస్యలపై తొమ్మిది అర్జీలు వచ్చినట్లు జెడ్‌సి బొడ్డేపల్లి రాము తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఆరు, ప్రజారోగ్యానికి సంబంధించి మూడు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అర్జీలను తదుపరి చర్యలకు సంబంధిత విభాగాల అధిపతులకు నివేదించినట్లు తెలిపారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు బంగ్లామెట్ట దుర్గాలమ్మ ఆలయంలో అయ్యప్పపీఠం ఆధ్వర్యంలో జివిఎంసి కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, రమేష్ దంపతుల ఆర్థికసాయంతో సోమవారం నిర్వహించిన అన్నసమారాధనను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ ప్రారంభించారు. వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని అందజేశారు. స్థానికులు తమ్మిన సూరిబాబు, జగుపిల్ల ప్రసాద్, కొప్పల కృష్ణ పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోనిగుడిలోవ రంగనాథస్వామి కొండపై కార్తీక మూడవ సోమవారం పురస్కరించుకొని మూడు వేలమందికి అన్నసమారాధన నిర్వహించారు. వేకువజామునుకు ముందునుంచే శివాలయాలలో ప్రత్యేక పూజలు చేపట్టారు.స్వచ్ఛంద సేవకులు పినగం రామారావు, రేగాన శంకరరావు, మీసాల నరసింగరావు, పట్నాల బంగారు నాయుడు, లొడగల వెంకటరావు ,బుత్తుల మధు, పినగం రమణ,గొంప ఈశ్వరరావు, చందక శంకరరావు, వెములవలస సింహాచలం,పాల్గూరి రాజా, పాలూరి బంగారునాయుడు, కొర్రా మల్లికార్జున రావు, కోరాడ రమణ, చందక శంకర్, చందక వెంకటరావు, బాయిన కోటేశ్వర రావు, ముద్దాడ సన్యాసిరావు, బంక కృష్ణం నాయుడు, చందవరపు కుమార్, చందక శంకర్, యన్. సోమినాయుడు పిళ్ళ రాజు, ఉప్పాడ నవీన్ కుమార్ మేడిశెట్టి రాంజీ, లంక సంతోష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి సాయానికి వినతి



ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న పత్నిరావు

ప్రజాశక్తి- ములగాడ: కాలేయం వ్యాధితో బాధపడుతున్న తనకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని 60వ వార్డు అశోక్‌నగర్‌కు చెందిన మర్రిపు శ్రీనివాసరావు వేడుకున్నాడు సోమవారం వైసిపి నగర ప్రధాన కార్యదర్శి సరగడం పత్నిరావు నేతృత్వంలో పశ్చిమ నియోజకవర్గ వైసిపి ప్రాంతీయ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను తన ఆరోగ్య, ఆర్థిక పరిస్థితిని విన్నవించారు. ఇప్పటికే నగరంలోని విజేత హాస్పిటల్‌లో రెండుసార్లు ఆపరేషన్ జరిగిందని, సుమారు రూ.నాలుగు లక్షలు అప్పులు చేసి వైద్యానికి ఖర్చు చేశానని విన్నవించారు. ఆర్థిక ఇబ్బందులలో ఉన్న తనను ప్రభుత్వపరంగా ఆదుకుని, తన ఆరోగ్యానికి భరోసానివ్వాలని కోరాడు. దీనిపై ఆనందకుమార్ స్పందిస్తూ,ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి సాయం చేస్తానని భరోసానిచ్చారు.

గాయపడిన వైసిపి నేతకు పరామర్శ

ములగాడ: స్కూటీపై వెళుతూ గతనెల 28న గాజువాక రోడ్డులో ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన 40వ వార్డు ఎకెసి కాలనీ, ఎస్‌సి,ఎస్‌టి యూనియన్ ప్రెసిడెంట్, వైసిపి కార్యనిర్వాహణ గృహసారథిగా బాలకృష్ణను పార్టీ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్‌తోపాటు ఇతర నేతలు సోమవారం పరామర్శించారు. బాలకృష్ణ ఇంటికి వచ్చి పరామర్శించి, ఆర్థికంగా అండగా ఉంటానని భరోసానిచ్చారు. వార్డు కార్పొరేటర్‌గుండపు నాగేశ్వరరావు, వార్డు అధ్యక్షులు వరవల మహేష్ పాల్గొన్నారు,

'సన' ఇంజనీరింగ్ కంపెనీపై చర్యలకు వినతి



జిలా కమిషనరుకు వినతిపత్రం అందజేస్తున్న గోవిందు

ప్రజాశక్తి- గాజువాక: జివిఎంసి 87వ వార్డులోని గాజువాక ఆటోనగర్ ఇ-బ్లాక్‌లో ఉన్న సన ఇంజనీరింగ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని వైసిపి ఐదువార్డుల అధ్యక్షులు బొడ్డ గోవిందు కోరారు. సోమవారం జిలా కమిషనర్ జైచంద్రకు నతి పత్రం అందజేశారు. కంపెనీలో అర్ధరాత్రి వరకు వెల్డింగ్, ఇసుక బ్లాస్టింగ్ పనులు చేస్తున్నారని, దుమ్ము, ధూళి, పొగలతో కంపెనీ వద్ద వాయు, శబ్ద కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతే కాకుండా కంపెనీ గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో ఇక్కడ పనిచేసే కార్మికులు పరిసరమహిళల పట్ల అసభ్యకరంగా చూస్తున్నారని విన్నవించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరారు.

త్వరితగతిన కులగణన సర్వే

ప్రజాశక్తి- భీమునిపట్నం: ఈనెల 9 నుంచి చేపట్టనున్న కులగణన సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ లవరాజు.పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కులగణన సర్వే ప్రాధాన్యతను వివరిం చారు. కులగణన సర్వేపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని వేములవలస, బిపి.కళ్లాలు వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న గరీబ్ కల్యాణ్ అన్న యోజన,పిఎం ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన, జల్‌జీవన్ మిషన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, జన్‌ధన్ యోజన వంటి పథకాలను అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపిడిఒ లవరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా పథకాల లబ్ధిదారుల అనుభవాలను వారితోనే చెప్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన పైడిరాజు, పి.వి ప్రసాదరావు పట్నాయక్, మీసాల రామునాయుడు, కె.రామ నాయుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, కోరాడ రాంబాబు, కోన శ్రీను, బండారు అనిల్‌కుమార్, డిఆర్‌కె. రాజు, పాల్గొన్నారు.

ప్రకృతి సిద్ధమైన కషాయాలతో పైర్లలో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి- ఆనందపురం: నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి ప్రకృతి సిద్ధమైన కషాయాలతో పైర్లలోని తెగుళ్ళు, చీడపీడలను నివారించవచ్చని జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ చక్రవర్తి అన్నారు. సోమవారం తర్లువాడలో ప్రకృతి వ్యవసాయ విధానంలో రబీ పంటలకు ఆశిస్తే పురుగులు తెగుళ నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సామూహిక కషాయాల తయారీపై శిక్షణనిచ్చారు.కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ డివిజన్ మాస్టర్ వనజ, ట్రైనర్ పద్మ, మండల ఇన్‌ఛార్జి రామారావు, యూనిట్ ఇన్‌ఛార్జి పైడిరాజు రైతులు పాల్గొన్నారు

రెండోవిడత నృసింహ దీక్షలు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో రెండో విడత 32 రోజుల నృసింహ దీక్షలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీక్షా వస్త్రాలు, మాలలను స్వామి ఉత్సవ విగ్రహాల వద్ద నుంచి ప్రత్యేక పూజల అనంతరం దీక్షాపరులతో అర్చకులు దీక్షాధారణ గావించారు. వందలాది మంది భక్తులు దీక్షలను స్వీకరించారు.

శిథిలమైన శ్లాబ్‌తో భయంభయం

- పెచ్చులూడి పడుతున్న ఇఒ కార్యాలయం పైకప్పు
- వర్షానికి నీరు కారడంతో చిత్తడిచిత్తడిగా భవనం



పెచ్చులూడిన ఇఒ కార్యాలయ భవనం పైకప్పు

ప్రజాశక్తి- సింహాచలం: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు సింహాచల దేవస్థానం ప్రధాన కార్యాలయం శ్లాబ్ లీక్ అయి కారుతోంది. ఇఒ కార్యాలయంతో పాటు స్టేషనరీ రూమ్ కూడా ఇటీవలే శ్లాబ్ రిపేరు చేశారు. ఇఒ కార్యాలయానికి వెళ్లే దారిలో శ్లాబు పెచ్చులూడి కిందపడుతుండడంతోపాటు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు శ్లాబంతా కారిపోవడంతో అక్కడ చిత్తడిగా మారింది. శ్లాబు శిథిలమై ప్రమాదభరితంగా ఉన్న నేపథ్యంలో పెచ్చులూడి పడి ఎవరికైనా గాయాలు కాకముందే తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని వెదుళ్లపాలెం జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీక్లీనర్ డొప్పు పైడితల్లి మృతి చెందినట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. వెదుళ్లపాలెం జంక్షన్ సమీపంలో విజయనగరం జిల్లా కందివలసకు చెందిన లారీ క్లీనర్ పైడితల్లి రోడ్డు పక్కన లారీని నిలుపుదల చేసి, లారీ టైర్లను పరిశీలిస్తుండగా, అదే సమయంలో తుని వైపు నుంచి నక్కపల్లి వస్తున్న లారీ ఆగి ఉన్న లారీని, పైడితల్లిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పైడితల్లి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఇదే సమయంలో వెనక నుండి వస్తున్న మరో ప్రైవేట్ బస్సు వేగంగా వచ్చి పాల వ్యాను ఢీకొని రోడ్డు పక్కకు దూసుకుపోయింది. బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : రైలు నుండి జారి పడి యలమంచిలి రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్ ఫారం ముందర గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో మృతదేహాన్ని ప్రయాణికులు గుర్తించి రైల్వే పోలీసులకు తెలియజేశారు. మృతుని వయసు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చు. మృతదేహం వద్ద లభించిన అన్నవరం దేవస్థానం ప్రసాదం ప్యాకెట్లు, కొబ్బరికాయతో కూడిన కవరు దొరికాయి. అన్నవరం నుండి విశాఖపట్నం ప్రయాణించే రైల్వే టికెట్ ఉందని తుని రైల్వే పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఈ మృతదేహాన్ని తుని గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వాళ్లు తుని రైల్వే పోలీసులకు తెలియపరచాలని కోరారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-రోలుగుంట: గంజాయి రవాణా కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రోలుగుంట ఎస్ఐ సురేష్ తెలిపారు. ఇటీవల నిండుగొండ జంక్షన్ వద్ద పట్టుబడిన గంజాయి కేసులో వీరుతప్పించుకు తిరుగుతున్నారని, నిందితులను వడ్డిప జంక్షన్ వద్ద పట్టుకొని అరెస్టు చేశామన్నారు.

పంట పొలాల పరిశీలన



టి.నగరపాలెంలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఎఒ

ప్రజాశక్తి- భీమునిపట్నం: తుఫాన్ నేపథ్యంలో మండలంలోని పలుగ్రామాల్లో పంటపొలాలను మండల వ్యవసాయశాఖాధికారి బి.శివకోమలి సిబ్బందితో కలిసి పరిశీలించారు. సోమవారం టి.నగరపాలెం, తాటితూరు, సంగివలస గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు ఇప్పటికే కోతలు పూర్తయిన పంటలను కుప్పలుగా పెట్టి జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. రైతుభరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

సిహెచ్‌సి సూపరింటెండెంట్‌గా ప్రదీప్‌కుమార్



డాక్టర్ ప్రదీప్‌కుమార్

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక సిహెచ్‌సి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. సిహెచ్‌సిలో ఎనస్థీషియన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్‌కు సూపరింటెండెంట్‌కు నియమిస్తూ డిఎంహెచ్ఒ ఉత్తర్వులు జారీ చేశారు.ఇక్కడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ ఫణికుమార్ వ్యక్తిగత కారణాలతో సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు శాంతినగర్‌లో రూ.49.70లక్షలతో నిర్మించిన మూడంతస్తుల సామాజిక భవనాన్ని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు.ఈ భవనం మొదటి అంతస్తులో సచివాలయం., రెండవ అంతస్తులో థాన్ ఫౌండేషన్ గ్రూప్స్‌కు, మూడవ అంతస్తులో డ్వాక్రా స్వయంసహాయక సంఘాలకు కేటాయించారు. అలాగే సంజీవయ్య కాలనీ రూ.15.45లక్షలతో నూతన సచివాలయ భవనాన్ని కూడా ప్రారంభించారు
ఈ సందర్భంగా కెకె. రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత అభివృద్ధి, సంక్షేమంతోపాటు మౌలిక సౌకర్యాల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, జివిఎంసి డిఇ భరణికుమార్, ఎఇఇ మామహేశ్వరరావు, వార్డు నాయకులు బలిరెడ్డి గోవింద్, కె.చిన్న, దూది నరసింగరావు, కె.రామారావు, స్వామినాయుడు, కె.శ్రీను, యన్.ఈశ్వరరావు, దుర్గాభవాని, యస్.రామారావు, యన్.కృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ మురళీమోహన్‌కు సిజిపి ప్రశంస



ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ మురళీమోహన్

ప్రజాశక్తి- విశాఖపట్నం : చెన్నైలోని కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ (సిజిపి) సంస్థ తన సేవలను గుర్తించి గౌరవ ప్రశంసాపత్రం అందజేసిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) కోశాధికారి డాక్టర్ మురళీమోహన్ తెలిపారు. ఆదివారం కొలకత్తాలో జరిగిన ఐఎంఎ, సిజిపి జాతీయ సదస్సు, స్నాతకోత్సవంలో పశ్చిమ బెంగాల్ మంత్రి జనాబ్ జావేద్‌ఖాన్, ఎంపీ డాక్టర్ సంతాన్‌సేన్,ఎమ్మెల్యే డాక్టర్ నిర్మల్ మాగి, ఐఎంఎ పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జెఎ.జయలాల్, ఐఎంఎ, సిజిపి డీన్ డాక్టర్ రాయపు రమేష్‌బాబు, నూతన డీన్ డాక్టర్ సత్యజిత్ బోరా వంటి ప్రముఖుల సమక్షంలో ఐఎంఎ జాతీయఅధ్యక్షుడు డాక్టర్ శరద్‌కుమార్ అగర్వాల్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరించినట్లు తెలిపారు.కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ తన సేవలను గుర్తించి, ప్రశంసాపత్రం అందజేయడం ఆనందంగా ఉందని డాక్టర్ మురళీమోహన్ ప్రజాశక్తితో తెలిపారు. సదస్సులో దేశం నలుమూలల నుంచి అనేకమంది వైద్యులు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారునికి ఆర్థిక సాయం



నగదు సాయం అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

ప్రజాశక్తి-భీమునిపట్నం : పాండిచ్చేరిలో జరగనున్న శికా నేషనల్ కరాటే ఛాంపియంషిప్- 2023పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న బ్యాంకు కాలనీకి చెందిన క్రీడాకారుడు కర్రి చిట్టిబాబుకు స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ చంద్రమూర్తి సోమవారం రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. పోటీల్లో సత్తా చాటి పతకంతో రావాలని ఆకాంక్షించారు.

కొనుగోళ్లు లేక కళ్లాల్లోనే ధాన్యం!

- మిచౌంగ్ తుపానుతో పంట నిల్వకు అవస్థలు
- ప్రకటనల్లోనే రైతన్నలకు భరోసా
- కన్నీళ్లతో అన్నదాతల ఎదురుచూపులు
- జాయింట్ కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు



బోని గ్రామంలో కళ్లాల్లో కుప్పలుగా ధాన్యం రాశులు, బస్తాలు

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రభుత్వం మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన లేదని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. రైతన్నలకు అన్ని విధాలా భరోసాగా ఉంటామన్న మాటలు ప్రకటనల్లోనే తప్ప ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌ల్లో నానా అవస్థలు పండించిన ధాన్యం, కొనుగోళ్ల లేక కళ్లాల్లోనే రోజుల తరబడి నిల్వ ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మిచౌంగ్ తుపాన్ ముంచుకొస్తుండడంతో పొలాల్లోని చేనుతోపాటు కళ్లాల్లో సిద్ధమైన ధాన్యాన్ని కాపాడుకోవడం తలకుమించిన భారంగా మారిందని దిగులు చెందుతున్నారు.

మండలంలోని బోని గ్రామంలో అత్యధిక శాతం రైతులు వరిపంటను సాగుచేస్తుంటారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆది నుంచి ప్రతికూల పరిస్థితుల్లోనే నానా ఇబ్బందులు పడి పండించిన ధాన్యం 15రోజుల క్రితమే కోసి, చేను ఎండబెట్టి, ధాన్యం అమ్మకానికి సిద్ధం చేసినా కొనే దిక్కులేక సతమతమౌతున్నారు.

గ్రామానికి చెందిన కనకల నర్సింగరావు 5 ఎకరాలు, కనకల సీతారాం 4 ఎకరాలు, కనకల శ్రీను 4 ఎ కరాలు , బుగత సూరి 7 ఎకరాలు, మద్దిల తాత నాయుడు 2 ఎకరాలు, బోని గోవింద 8 ఎకరాలు, కాళ్ళసురేష్ 4 ఎకరాలు ధాన్యం సిద్ధంచేసి, బస్తాల్లో ఎత్తి అమ్మకానికి సిద్ధంగా పొలాల్లోనూ, కళ్లాల్లోనూ, మరికొంతమంది స్థానిక కల్యాణమండపం వద్ద ఆరుబయటే ఉంచారు. ఇటీవల బోని గ్రామాన్ని సందర్శించిన జిల్లా జాయింట్ కలెక్టర్ కె విశ్వనాథన్, ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా గతనెల 29న కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ సంబంధిత అధికారుల్లో కనీస చలనం లేక కొనుగోళ్ల జరపకపోవడంతో ధాన్యం బస్తాలన్నీ మూలుగుతున్నారు.

ముంచుకొస్తున్న మిచౌంగ్‌తో భయం

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో వాతావరణ మార్పులతో ధాన్యం బస్తాలను టార్పాలిన్లు కప్పి సంరక్షిస్తున్నారు. వీడకుండా వర్షపు జల్లులు కురుస్తుండడంతో ధాన్యం తడిసి రంగుమారి, నాణ్యత చెడిపోతుందేమోనని కలవరపడుతున్నారు. ధాన్యం సిద్ధమైన వెంటనే ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామని ఇటు అధికారులు, అటు ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అటువంటి చర్యలేమీ కనిపించడం లేదని అంటున్నారు. దాదాపు 200 మంది వందల ఎకరాల్లో పండించిన ధాన్యం సిద్ధంగా కొనేదిక్కు లేకపోవడం, మరోవైపు తుఫాన్ భయం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది.

కార్యరూపం దాల్చని గొడౌన్‌ల ఏర్పాటు

రైతులు పండించిన పంటను ఆరబెట్టి నిల్వ ఉంచేందుకు గొడౌన్‌లను ఏర్పాటు చేయాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నేటికీ కార్యరూపం దాల్చలేదని భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు ఆరోపించారు. రైతు ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు గొడౌన్‌లు ఉంటే ఇలా భయపడాల్సిన పరిస్థితి ఉండదని, మంచి గిట్టుబాటు ధర వచ్చినప్పుడే తమ పంటలను అమ్ముకునే వెసులుబాటు రైతులకు కలుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని, లేకుంటే, పంటలను ఎప్పటికప్పుడు కొనుగోళ్లు చేసేలా చర్యలు, మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు.

రైతుల్లో తుపాను కలవరం



మద్దిలో టార్పాలిన్లు కప్పి ఉంచిన ధాన్యం, వరి కుప్పలు

పద్మనాభం: పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు అన్నదాతలను కలవరానికి గురిచేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ రాకముందే 80 శాతం మంది రైతులు. వరి పంటను కోశారు. తుపాన్ ప్రకటనతో ఆదరాబాదరాగా అవకాశముంటే నూర్పిళ్లు, లేదంటే కుప్పలు వేసి పంట సంరక్షణ చర్యలు చేపట్టారు. ధాన్యం సిద్ధమైనా కొనుగోళు లేకపోవడంతో బస్తాలను నిల్వ ఉంచేందుకు నానా తంటాలు పడుతున్నామని వాపోతున్నారు.

మద్ది గ్రామంలో కాల సన్యాసినాయుడు అనే రైతు, 15 ఎకరాల భూమిని కౌలుకుసాగుచేసి వరిపంట వేశాడు వర్షాభావంతో మోటార్లతో సాగునీరు అందించి, దమ్ములు నుంచి చివర వరకు పంటను సంరక్షించారు.తుపాన్ భయంతో ఎకరాకు రూ.మూడు వేలు ఇచ్చి వరికోత యంత్రంగా చేను కోసి ధాన్యాన్ని సిద్ధం చేశారు.అయితే కొనే దిక్కులేకపోవడం, ఈలోగా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురవడంతోఅద్దెకు టార్పాలిన్లు తెచ్చి బస్తాలను కప్పి సంరక్షించే పనులు చేపట్టాడు.ధాన్యం సేకరణలో అధికారుల జాప్యం వల్లే తాను ఇన్ని అవస్థలు పడుతున్నానని వాపోతున్నాడు.మండలంలో పలువురు రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

వీడకుండా కురుస్తున్న వర్షంతో అవస్థలు

పెందుర్తి : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వీడకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెందుర్తి ప్రాంతంలో కార్మికనగర్, పాప రాజుయ్యపాలెం, బిసికాలనీ, ఏకలవ్య కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం చల్లని గాలులు, ఎడతెరిపిలేని చిరుజల్లులతో జనం ఇక్కట్లు పడుతునానరు. రోడ్లన్నీ బురదమయంగా మారాయి. న్న చిన్న కాలువలు పొంగిపొర్లుతున్నాయి ఫుట్‌పాత్ వ్యాపారాలన్నీ స్తంభించాయి. లోతట్టు ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు. సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కోరుతున్నారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా కాల్‌సెంటర్‌కు సమాచారమివ్వాలని కోరుతున్నారు.

తుపానుతో అధికారుల అప్రమత్తత

జోనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి- వేపగుంట : మౌచింగ్ తీవ్ర తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు అధికారయంత్రాంగం, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉన్నట్లు జెడ్‌సి మల్లయ్యనాయుడు తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ఎనిమిదో జోన్ పదివార్డుల్లోని 73 సచివాలయాల సిబ్బంది మూడు షిఫ్టులుగా రోజంతా విధుల్లోనే ఉంటారని తెలిపారు. రౌండ్‌ది క్లాక్ అందుబాటులో ఉండేలా 0891-27353753 నెంబరుతో కంట్రోల్ రూం, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా చెట్లు విరిగి, రహదారిలో రాకపోలకు అంతరాయం కలిగితే ఇంజినీరింగ్ బృందం, కాలువలు పొంగినా, పూడుకు పోయినా స్పందించేందుక శానిటేషన్ బృందం, పాత భవనాల్లోని నివాసితులను అప్రమత్తం చేయడానికి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, ముంపుప్రాంతాల వారిని పునరావాసాలకు తరలించేందుకు ఎపిడి సిద్ధంగా ఉంటారన్నారు. జోన్ పరిధిలో ఏకలవ్య కాలనీ, దగ్గువాని పాలెం, యాతపేట, విమాననగర్, భగత్‌సింగ్ నగర్, కొత్తపాలెం, దుర్గానగర్, జ్యోతిగాయత్రి నగర్ తదితర ప్రాంతాలు ముంపు బాధిత ప్రాంతాలుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయనున్నట్లు తెలిపారు. తుఫాన్ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు నాలుగు జెసిబిలు, ఆరు టిప్పర్లు, నాలు గేసి కటింగ్ మిషన్లు, చైన్‌మిషన్లు సిద్ధం చేశామన్నారు.

లోతట్టు, కొండవాలు ప్రాంతాల్లో అప్రమత్తత

విశాఖపట్నం : మిచౌంగ్ తీవ్ర తుఫాను నేపథ్యంలో లోతట్టు, కొండవాలు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోన్-5 కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ సూచించారు. రానున్న రెండు, మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు జోనల్ కార్యాలయంలో 24గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదం పొంచిఉన్న ప్రాంతాల ప్రజలకు పునరావాన షెల్టర్లు సిద్ధం చేశామన్నారు. ఏదైనా ప్రమాదం వాటిల్లితే వెంటనే ఈ ఫోన్ నెంబర్ 0891-2711480కు ఫోన్ చేయాలని జెడ్‌సి సూచించారు.

తీరం.. అప్రమత్తం...

వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరికల జారీ



మత్స్యకారులకు సూచనలు ఇస్తున్న ఎఫ్‌డిఒ లావణ్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి లావణ్య,సచివాలయ మత్స్యశాఖ సహాయకులు కలిసి సోమవారం తీర ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు సముద్రంలో వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు తీరంలో ఉన్న అన్నవరం, పెద నాగమయ్య పాలెం, చిన నాగమయ్య పాలెం, బోయివీధి, ఎగువపేట, చేపలుప్పాడ, మంగమారిపేట, కాపుల దిబ్బడిపాలెం ఏడు ల్యాండ్ సెంటర్లలో మోటారు బోట్లు, సాంప్రదాయ బోట్లు నిలుపుదల చేసేలా మత్స్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. భీమిలి అర్బన్, రూరల్‌లోని తీర ప్రాంతంలో 470మోటారు బోట్లు, సాంప్రదాయ బోట్లు ఉన్నాయి.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ -2024పై చర్చించేందుకు ఈనెల 5న మంగళవారం సాయంత్రం ఐదుగంటలకు తమ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

తుపానుతో వరి పంటకు తీవ్ర నష్టం

- గాలులకు నేలమట్టమైన చేను

- వర్షానికి తడిసిన వరి పనలు

- కూలీలు దొరక్కపోవడంతో లబోదిబోమంటున్న రైతులు

ఖరీఫ్ సీజన్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ వరినాట్లు వేసి, వ్యయ ప్రయాసలకోర్చి చివరి వరకు పంటను రక్షించుకుంటూ వచ్చిన రైతులు..., పంట చేతికొస్తున్న సమయంలో అకాలంగా వచ్చిన తుపాన్‌తో తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. తుపాన్ కారణంగా వీచిన గాలులకు పండిన పంట నేలమట్టమైంది. కూలీలు దొరక్కపోవడంతో కొన్ని ప్రాంతాల్లో కోత కోసిన వరి పనలు పొలంలో తడిసి పోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.



అనకాపల్లి మండలం మార్టూరులో నేలమట్టమైన వరి చేను

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలంలో సాధారణ వరి విస్తీర్ణం సుమారు 7,400 ఎకరాలు కాగా ఈ ఏడాది 5,274 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందలో 1300 ఎకరాల వరి పంట వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయింది. మండలంలోని మార్టూరు, తుమ్మపాల, వెంకుపాలెం, సీతానగరం, అనకాపల్లి, కుంచంగి, కూండ్రం, బవులవాడ, రేబాక తగరంపూడి తదితర గ్రామాల్లో రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, వర్షాలు లేకపోయిన ప్రత్యామ్నాయ నీటి వనరులను ఉపయోగించుకొని పంటను రక్షించుకుంటూ వచ్చారు. తీరా పంట ఇంటికి వచ్చే సమయంలో తుఫాను రైతులను ముంచుతోంది. తుఫాన్ కారణంగా వీచిన గాలులకు ఆయా గ్రామాల్లో పండిన పంట నేలమట్టమైంది. వందలాది ఎకరాల్లో రైతులు వరి పంట కోత కోయగా, దానిని కుప్పలుగా పెట్టేందుకు కూలీలు దొరక్కపోవడంతో పంట పొలంలోనే ఉండిపోయింది. తుపాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పనులు తడిసి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయితే వ్యవసాయ అధికారులు మాత్రం వర్షం ప్రభావం వరి పంటపై ఉండదని చెబుతున్నారు.

ఆందోళనలో అన్నదాతలు

కె.కోటపాడు : ఇప్పటి వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న వరి పంట తుపాన్ కారణంగా నష్టం జరుగుతుండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కె.కోటపాడు మండలంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో 2వేల హెక్టార్లలో పంట వేశారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో సెప్టెంబర్ నెలాఖరి వరకు నాట్లు వేస్తూనే ఉన్నారు. తరువాత వర్షాలు పూర్తిగా ముఖం చాటేయడంతో 500 హెక్టార్ల పైనే వరి పంట ఎండిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరి పంట పండించారు. తెగుళ్ళ బారి నుండి వరి పైరును కాపాడుకుంటూ వచ్చారు. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం మండలంలోని 30 శాతం వరి కోతల పూర్తయ్యాయి. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో కోత కోసిన వరి పనలు పూర్తిగా ఎండకుండానే రైతులు హడావుడిగా కుప్పలు వేశారు. దీని వల్ల పంట నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు..

తడిసిన వరి పంట

బుచ్చయ్యపేట : మిచౌంగ్ తుఫాను నేపథ్యంలో సోమవారం ఉదయం నుండి వర్షం ఎడతెరిపి లేకుండా పడింది. దీంతో మండలంలోని చిన్నప్పన్నపాలెం, పోలేపల్లి, వడ్డాది తదితర గ్రామాలో రైతులు కోతల కోసి పొలాల్లోనే విడిచిపెట్టిన పంట తడిసిపోయింది. తుఫాను వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

బిక్కుబిక్కు మంటున్న రైతులు

సబ్బవరం : మండలంలోని తుఫాన్ కారణంగా వరి రైతులు బిక్కు బిక్కు మంటున్నారు. అనావృష్టిని తట్టుకొని వరి పంట వేస్తే తుపాన్ తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 3300 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను ఈ ఏడాది వరి పంటను 3100 ఎకరాల్లో నాట్లు వేసినట్లు మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. పంట కాలంలోని సున్నిత దశలలో వర్షాల్లేక గింజ పూర్తిగా కట్టక కొంత పొల్ల రూపంలో ఉండిపోతుంది. మిగిలిన పంట చేతికి వస్తుందనుకున్న దశలలో తుఫాను రైతులను బెంబేలెత్తిస్తోంది. ఈ రెండు రోజుల్లో సబ్బవరం మండలంలో 20.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అనావృష్టి కారణంగా వరి పంట పండక 110 ఎకరాల వరకు కోసివేయగా, మరో 220 ఎకరాల్లో పండిన పంటను కోతలు కోసి కుప్పలు పెట్టారు. ఇంకా కోత కోయాల్సిన పంటపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుల్లో తీవ్ర అలజడి


కొత్తకోట : మిచాంగ్ తుఫాన్ ప్రభావం రైతులలో తీవ్ర అలజడి రేపింది. ఆరు గాలం పాటు శ్రమించడంతో పక్వానికి వచ్చిన వరి పంట నీటి పాలవుతోందన్న భయంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది లో గత మూడు నెలలు గా సకాలంలో వర్షాలు కువక పోయిన సరే వరి పంటలను రైతులు కష్ట పడి నిలబెట్టారు. కోత దశలో ఉన్న వరి పంటను రేపో మాపో సమాకుర్చుకోవాల్సిన దశలో తీవ్ర తుఫాన్ రావడం తో కొంత మంది రైతులు ఆందోళనలో ఉన్నారు.

రావికమతం మండలంలో సుమారు ఆరు వేలకు పైగా ఎకరాలలో వరి నాట్లు వేశారు. కొత్తకోట, జెడ్.కొత్తపట్నం, చీమలపాడు, గంపవానిపాలెం, దొండపూడి, టి.అర్జాపురం, కన్నంపేట, వమ్మవరం, మర్రివలస గ్రామాల భూములకు స్థానిక కల్యాణపు లోవ జలాశయం నీరు అందించగా, మేడివాడ, రావికమతం, గుడివాడ, గొంప, గుడ్డిప, మరుపాక, మట్ట వానిపాలెం తదితర ప్రాంతాల భూములకు పెద్దేరు జలాశయంతో పాటు స్థానిక రైతుల మోటార్ల ద్వారా పంటలను పండించారు. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా తుఫాన్ ఏర్పడంతో రైతులలో తీవ్ర ఆందోళన ఏర్పడింది. మండలం కొన్ని చోట్ల వరి పంట పక్వానికి రాగా మరి కొన్ని చోట్ల కోసిన పంట వర్షానికి తడిసి ముద్దవుతోం ది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం వచ్చినా అధిక పెట్టు బడులతో నిలబెట్టిన పంట చేతికి అందే సమయంలో ఇలా తుఫాన్ రావడంతో రైతు కంట కన్నీరు వస్తోంది.

వర్షపు నీటిలో వరి పంట

నక్కపల్లి : మిచౌంగ్ తుపాన్ దూసు కొస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో రైతుల గుండెల్లో అలజడి నెలకొంది. నిన్న, మొన్నటి వరకూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కష్ట నష్టాల కోర్చి పండించిన పంట కోతకు వచ్చే సమయంలో తుపాన్ హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలో 5250 సాధారణ విస్తీర్ణం కాగా, 1300 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. వర్షాలు లేక పోవడంతో సుమారుగా 700 ఎకరాల వరకు ఎండిపోయాయి. మిగిలిన 600 ఎకరాల్లో వరిని కాపాడుకునేందుకు రైతులు అష్ట కష్టాలు పడ్డారు.వారం, పది రోజుల్లో అడపాదడపాగా రైతులు సుమారుగా 100 ఎకరాల్లో వరి కోతలు కోశారు. ఇంకా 500 ఎకరాల్లో వరి కోత దశకు చేరుకుంది. ఇటువంటి పరిస్థితుల్లో మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో సోమవారం కురిసిన వర్షం, వీచే గాలులకు వరి చాలా చోట్ల నేల కొరిగింది. కోత దశకు వచ్చిన వరి పంట చేతికందేనా అంటూ రైతులు అవేదన చెందుతున్నారు.

పంట తీవ్రంగా దెబ్బతింది



అర ఎకరం పొలం కౌలుకు తీసుకొని వరి పంట వేశాను. రూ.20 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. తుఫాను వల్ల నా వరి పంట దెబ్బతింది. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

- గొంతిన సూరిబాబు, కౌలు రైతు, తుమ్మపాల

నష్ట పరిహారం ఇవ్వాలి



సుమారు మూడు ఎకరాల్లో వరి పంట వేశాను. లక్ష రూపాయల వరకు పెట్టుబడి అయ్యింది. పంట కోసి కుప్పలు పెడదామనుకుంటున్న సమయంలో కూలీలు దొరక్క వరి పనులు మడుల్లోనే ఉండిపోయాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి పంట నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- వేపాడ రమణమ్మ, రైతు, గుంకల్లోవ

అధికారుల హెచ్చరికలు పట్టించుకోకపోవడంతోనే నష్టం



తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలోనూ అనకాపల్లి మండలంలో 60 శాతం పైబడి వరి నాట్లు పడ్డాయి. ప్రస్తుత తుఫాను కారణంగా కొంతమేర వరి పంటకు నష్టం జరిగే అవకాశం ఉంది. కేవలం 9 ఎకరాల్లో వరి పంట కోసినట్టుగా అధికారకంగా తెలిసింది. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో నష్టపోతున్నారు.

- రంగాచారి, అనకాపల్లి మండల వ్యవసాయ అధికారి

కళ్లు ఉప్పు జల్లాలి

వరికుప్పలు వేసే ముందు పచ్చిగా ఉన్న వరి పనలపై కళ్లుఉప్పు జల్లాలి. ఈదురుగాలులకు కుప్పలు పడిపోకుండా టార్పాలను వేసి ఆపైన బరువు ఉంచాలి. ఎటువంటి పంట నష్టం జరిగిన వెంటనే స్థానిక వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలి.

-సోమశేఖర్, కె.కోటపాడు వ్యవసాయ శాఖ అధికారి



కె.కోటపాడు మండలంలో పొలంలో పెట్టిన కుప్పలు



సబ్బవరం మండలంలో కుప్పలు పెడుతున్న రైతులు



నక్కపల్లి మండలం కాగితలో వర్షపు నీటిలో వరి పనలు

తుపాన్‌పై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

మిచౌంగ్ తుపానుకు జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. రహదారులపై చెట్లు కూలితే తక్షణమే తొలగించడానికి, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు, పునరావాస కేంద్రాలలో వైద్య శిబిరాలు ఏర్పాటుకు, ఆ కేంద్రాలలో పారిశుధ్యం, వైద్యం అందించడానికి, గ్రామాలలో పారిశుధ్య పనులు నిర్వహణకు, భారీవర్షాలకు పంటలకు, తోటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, అదనపు ఎస్పీ విజయ భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, ఉద్యానవనాధికారి ప్రభాకర్‌రావు, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఏ హేమంత్, సిపిఓ జి.రామారావు ఆర్ అండ్ బి ఈఈ రమేష్, డీఎస్ఓ కేవీఎల్ఎన్ మూర్తి, డిఎం. జయంతి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, మత్స్యశాఖ డిడి పి.ప్రసాద్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి లక్ష్మి, డీఈవో వెంకట లక్ష్మమ్మ, పంచాయతీరాజ్ ఈఈ వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు

అనకాపల్లి : తుపాన్ కారణంగా 5, 6 తేదీల్లో పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అనకాపల్లి జిల్లా రైతాంగానికి వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను సోమవారం తెలియజేశారు. రైతులు తమ సూచనలు పాటించాలని కోరారు. వరి పొలంలో నీరు నిల్వ ఉంటే తక్షణమే తొలగించాలి. వర్షాలకు పనలు తడిసి ఉంటే గింజ రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలి. లేదా ఎకరాకు 20 కిలోల ఉప్పు వరి పనలపై జల్లుకోవాలి. చేను పడిపోయి, కోతకు ఇంకా సమయం ఉంటే పంట పాడవకుండా రెండు మూడు దుబ్బులు కలిపి నిలగట్టుకోవాలి.

ఇతర పంటలకు సూచనలు

వరి కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలంలో కోసే రెండు మూడు రోజుల ముందు పొలంలోని తేమను ఉపయోగించుకుని జనుము వేస్తే లాభదాయకంగా ఉంటుంది. భారీ వర్ష సూచన ఉన్నందున రబీ పంటను ఎత్తుకునేందుకు రెండు మూడు రోజులు వాయిదా వేసుకోవాలి. చెరకు పంటలో వర్షం నీరు నిలిచి ఉన్నట్టయితే తక్షణమే తొలగించి పడిపోయిన దుబ్బులను లేపి కట్టుకోవాలి. కాయగూరల పంటల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని, కాండం వేరుకుళ్ళు తెగులు ఆశించకుండా కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారి చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు.

తాళ్లపాలెం వారపు సంతపై తుపాను ప్రభావం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో ప్రతి సోమవారం జరిగే వారపు సంతపై తుపాన్ ప్రభావం చూపింది. ఈ సంతకు ప్రధానంగా మేకలు, పొట్టేలు, నాటు కోళ్ల కొనుగోలుకు పలు జిల్లాల నుండి ఇక్కడికి వస్తూ ఉంటారు. కూరగాయలు, ఇతర వ్యాపారులు ఎక్కువగా జరుగుతాయి. తుఫాన్ కారణంగా సోమవారం కొనుగోలు దారులు లేక వ్యాపారాలు సాగలేదు. దీంతో వ్యాపారులు దిగులు చెందారు.



వారపు సంతలో గొడుగులు వేసుకొని కొనుగోలు చేస్తున్న దృశ్యం



ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న వ్యకాస నేత వెంకన్న

ఢిల్లీ ధర్నాలో జిల్లా నేతలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : సామాజిక న్యాయం, దళిత హక్కుల రక్షణ కోరకు సోమవారం డిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎపి వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ దళిత, గిరిజనులపై దాడులు, అత్యాచారాలు, సాగడం దారుణమన్నారు.

షెడ్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-కె. కోటపాడు

మండలంలోని ఆర్‌వై అగ్రహారం గ్రామంలో కైలాస వాటిక దగ్గరలో షెడ్ నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ కన్నూరు లక్ష్మి, నాగభూషణం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందినవారు అనారోగ్యానికి గురై బయట హాస్పటల్లో చనిపోయిన వారుని గ్రామ కట్టుబాట్లు ప్రకారం స్మశానానికి దగ్గరలో ఉంచడంతో, రాత్రి వేళల్లో, వర్షాకాలంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామ పెద్దలు సమక్షంలో యువత కోరిక మేరకు స్మశాన సమీపంలో షెడ్డు నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ లెక్కల అచ్చిబాబు వార్డ్ మెంబర్లు మండ శ్రీనివాసరావు, బోని శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు యడ్ల పోతి బాబు, పోతల రాజు నాయుడు, రెడ్డి అప్పారావు, యడ్ల ముత్యాల నాయుడు, సత్యవరపు బాబు, యాళ్ల శ్రీను, వంటాకు చినబాబు (జెసిపి) యడ్ల అప్పలనాయుడు, బోని ఎర్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఫోక్ డాన్స్‌లో చిన్నారి యస్మిత ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సెమీ క్లాసికల్, వెస్ట్రన్, ఫోక్, ఫోక్ గ్రూప్ డాన్స్, కూచిపూడి అంశాల్లో నిర్వహించిన పోటీల్లో స్థానిక వేల్పుల వీధికి చెందిన చిన్నారి యస్మిత అద్భుత ప్రతిభ కనబరిచారు. గవరపాలెం కామాక్షి దేవి ఆలయంలో నిర్వహించిన ఈ పోటీల్లో సిరీ స్పందన నృత్యాలయంలో అభ్యసిస్తున్న యస్మిత ఫోక్ డాన్స్‌లో ప్రథమ, కూచిపూడి నృత్యంలో తతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆమెను కాకినాడ కరప మండలం ఎంపీడీవో కొంకి అప్పారావు పద్మావతి దంపతులు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, సిరి సంపద నత్యాలయం ఉపాధ్యాయురాలు స్పందన అభినందించారు.

క్రిస్మస్ వేడుకలు

ఎంవిఆర్ రూ.25వేలు విరాళం

ప్రజాశక్తి- అనకాపల్లి

కె.కోటపాడు మండలం కెఎన్ పురం చర్చిలో ఈ నెలలో జరగబోవు క్రిస్మస్ వేడుకలకు ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తన వంతు సహాయంగా 25 వేల రూపాయలను క్రైస్తవ సోదరులకు సోమవారం అందజేశారు. సోమవారం పట్టణంలోని నర్సింగరావుపేటలోని ఆయన ప్రధాన కార్యాలయ జరిగిన కార్యక్రమంలో ఎం.వి.ఆర్ మాట్లాడుతూ సేవా గుణంతో మనమందరం జీవితంలో అత్యున్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. ఈ మేరకు క్రైస్తవ సోదరులు తమ చర్చ్‌కు రావాలని ఎంవిఆర్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులతో పాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు, సంజూ బాబు టీం సభ్యులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఎంవిఆర్

యుటిఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీలక్ష్మి, చిన్నబ్బాయి



అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీలక్ష్మి, చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనకాపల్లి జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి , ఎన్నికల అధికారి ఎన్. అరుణ కుమారి ఆధ్వర్యంలో జరిగిన సంఘం ద్వితీయ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అధ్యక్షులుగా వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయ్ తిరిగి ఎన్నికయ్యారు. ఇంకా జిల్లా గౌరవ అద్యక్షులుగా నెల్లి సుబ్బారావు, సహాధ్యక్షులుగా కట్టా శ్రీను, మహిళా సహాధ్యక్షులుగా పి.గాయత్రి, కోశాధికారిగా జోగా రాజేష్, జిల్లా కార్యదర్శులుగా దొగ్గ శ్రీను, జిఎస్.ప్రకాష్, కళింగ సతీష్, ఎన్.శేషుకుమార్, వి.చైతన్య షీల, వి.రమేష్‌రావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా గార రాజబాబు, సభ్యులుగా గేదెల శాంతిదేవి, ఆర్.లక్ష్మణరావు, ఎం.శ్రీను, జి.అప్పలరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎన్ అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆర్థిక, సర్వీస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

రాష్ట్ర కౌన్సిలర్ వెంకట అప్పారావు



వెంకట అప్పారావు

అచ్యుతాపురం : యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా మారిశెట్టి వెంకట అప్పారావును జిల్లా యుటిఎఫ్ ప్రతినిధి వర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా వెంకట అప్పారావు విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. మండలంలోని దుప్పుతురు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వత్సవాయి శ్రీలక్ష్మి రెండోసారి అధ్యక్షురాలుగా, వెంకటాచలంలో పనిచేస్తున్న జిఎస్ ప్రకాష్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మండలం నుంచి ఎన్నికైన వీరికి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మద్దిల నానాజీ, కాకిలేటి సుభాషిణి దేవి అభినందనలు తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.హేమంత్‌కు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శాంతి, కార్యదర్శి ఇ.పార్వతి, సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్ తదితరులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఇ.పార్వతి మాట్లాడుతూ ఆశాల సమస్యలపై ఈనెల 11 , 12 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. ఆశావర్కర్స్ కనీసవేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలుగా మార్పుచేయాలని, పనిభారాన్ని తగ్గించాలని కోరారు. మొబైల్ వర్క్‌కి శిక్షణ ఇవ్వాలని, రికార్డ్స్ లేదా ఆన్లైన్ ఒక పని ఒకసారి మాత్రమే చేయించాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, 62 సంవత్సరాలు రిటైర్మెంట్ జిఓని వర్తింపచెయ్యాలని, ప్రభుత్వ శెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్ అమలు చెయ్యాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని, ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని, కోవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మరణించిన కుటుంబంలో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలని, ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశా యూనియన్ నేతలు

11, 12 తేదీలలో 36 గంటల ధర్నా

రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 36 గంటల ధర్నా జయప్రదం చేయాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు శాంతి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు విపరీతంగా పని భారం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి సత్యవతి, జిల్లా కార్యదర్శి కే వరలక్ష్మి, రామలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు రాజకీయ సమాధి కట్టాలి : అయ్యన్న

ప్రజాశక్తి -అచ్యుతాపురం

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికలలో రాజకీయ సమాధి కట్టాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కొండకర్ల గ్రామంలో సోమవారం ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ జగన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోయిందన్నారు. మూడు రాజధానుల పేరుతో నాటకాలు ఆడుతున్నాడని విమర్శించారు. వెనకబడిన తరగతుల వారికి సరైన ప్రాతినిధ్యం కల్పించడం లేదన్నారు. రెడ్డి కులస్తులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీష్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని భాస్కర్, టిడిపి నాయకులు రాజాన రమేష్ కుమార్, రంగనాయకులు, ధర్మిరెడ్డి నాయుడు బాబు, జనపరెడ్డి నరసింహారవు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులతో లక్ష్మీ ప్రసాద్

ఘనంగా న్యాయవాది లక్ష్మీప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, అడ్వకేట్ తలారి లక్ష్మి ప్రసాద్ జన్మదిన వేడుకలు సోమవారం తలారి లక్ష్మి ప్రసాద్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఉచితంగా మెడికల్, కంటి, దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బీసీ హాస్టల్ విద్యార్థులకు క్రీడా సామాన్లు పంపిణీ చేశారు. రక్తదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం

ప్రజాశక్తి -అనకాపల్లి

స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. తిరస్కరించిన వారికిచ్చే సమాధానంలో అందుకు గల కారణాలను వివరించాలన్నారు. సోమవారం నాటి స్పందనకు 176 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, ఎస్‌డిసి డాక్టర్ ఏ. మహేష్, డిఎం అండ్ హెచ్‌ఓ ఏ హేమంత్ పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో 31 ఫిర్యాదులు

సోమవారం పోలీసు స్పందన కార్యక్రమానికి 31 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని ఎస్పీ మురళీకృష్ణ స్వీకరించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సోమవారం నాటి స్పందన అర్జీల్లో ఆస్తి తగాదాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణ రావు, ఎస్సై బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లిని కరువు జిల్లా ప్రకటించాలి

ప్రజాశక్తి- కసింకోట

అనకాపల్లి జిల్లాలో కరువు పరిస్థితులను చూసి కరువు జిల్లాగా ప్రకటించి తక్షణం రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి డిమాండ్ చేశారు. కసింకోట మండలం బయ్యవరం గ్రామంలో సోమవారం వారు రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నా ఎక్కడ కరువు లేదని జగన్ రెడ్డి ప్రభుత్వం కళ్ళు మూసుకోవడం తగదన్నారు. రాష్ట్రంలో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పంటలను బట్టి ఎకరాకు 25 వేల నుండి 50 వేల రూపాయలు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రం పెట్టిన ప్రతి సవరణ బిల్లును తెస్తే, జగన్ రెడ్డి ఏమాత్రం ఆలోచించకుండా రాష్ట్రంలో వినియోగదారులపై అదనపు భారం మోపి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. అదానీ ప్రయోజనాల కోసం విద్యుత్ చార్జీలు భారీగా పెంచారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని నిలదీయకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కలగ సోమస్వేరరావు, కర్రి దుర్గ నాయుడు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి-మాడుగుల: మిచాంగ్ తుఫాను హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో మండల స్థాయి అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. తుఫాను కారణంగా మాడుగులలో పర్యటించిన ఆయన అధికారులకు అనేక సూచనలు ఇచ్చారు. అధికారులు స్థానికంగానే అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. రెవెన్యూ, ఆర్అండ్‌బి, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు సహా ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ, మండల పార్టీ అధ్యక్షులు తాళపు రెడ్డి రాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, జవ్వాది వరహాలు మండల నాయకులు పాల్గొన్నారు.

చీడికాడ: తుఫానుతో రానున్న రోజుల్లో జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కోరారు. ఈ సందర్భంగా ఆయన మండల తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో తుఫాన్ పై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయు గుండంగా మరవచ్చునని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరి ధాన్యాలు కోసిన (వరి పనలను) సురక్షిత ప్రాంతాలకు తరలించి టార్పాలిన్లు రక్షణగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రజలు ప్రమాదకర గెడ్డలు, వాగులు దాటి ప్రయాణాలు చేయవద్దన్నారు. ఎక్కడ నష్టం జరిగినా వెంటనే తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి.వి రాణి, ఎంపీడీవో జయప్రకాష్ రావు, వ్యవసాయ అధికారిని కృష్ణవేణి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చీడికాడలో మాట్లాడుతున్న బూడి ముత్యాలనాయుడు



ఎంవిఆర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎంవిఆర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మాడుగుల: సేవా గుణం కలిగిన వ్యక్తి ఎం వి ఆర్ అని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని వీరవల్లి అగ్రహారంలో లక్ష్మీ నరసింహస్వామి వ్రతకల్ప కార్యక్రమమునకు ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సేవా గుణం కలిగిన, అపారమైన భక్తి భావాలు కలిగి నిత్యం పూజా కార్యక్రమాలను ఎంవిఆర్ నిర్వహిస్తున్నారన్నారు. ఎంవిఆర్‌తో పాటు తనయుడు ముత్యాల సతీష్ అనేక సేవా కార్యక్రమంలో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. అన్న సమారాధనను ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆలయ కమిటీ ఇరువురుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎంవిఆర్ యువసేన సభ్యులు, సంజు టీం సభ్యులు పాల్గొన్నారు.



చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం రూ.2.47లక్షల చెక్కులను ముగ్గురు బాధితులకు అందజేశారు. మాకవరపాలెం మండలం కొండల అగ్రహారంకు చెందిన అంజూరి భాగ్యలక్ష్మికు రూ.1..40లక్షలు, బిక్కవోలు ప్రసాద్‌కు రూ.35వేలు, లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన సామిరెడ్డి నాగవెంకటరమణకు రూ.72వేలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం ఎంపిపి రుత్తల సత్యనారాయణ, మండల వైసిపి అధ్యక్షులు రుత్తల వాసు పాల్గొన్నారు.

టిడిపిలో యువతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-గొలుగొండ: వైసిపి అధికారం చేపట్టిన ఈ నాలుగురేళ్ల కాలంలో యువత తీవ్రంగా నష్టపోయిందని తెలుగదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. సోమవారం గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామంలో యువతతో విజయ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, టీడీపీ మొదటి నుంచి యువతకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తెలంగాణలో కేసీఆర్ ని ఏ విధంగా ఓడించారో అంతకంటే దారుణంగా ఈ వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపుతారన్నారు. వైసిపి హయాంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన 15 మంది యువకలు టీడీపీలో చేరారు. వీరిలో గ్రామ వలంటీర్ గణేష్ కూడా ఉండటం విశేషం. వీరందరికి విజయ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, తెలుగు యువత ప్రెసిడెంట్ కర్రి నాయుడు, నాగాపురం మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, పాత కేడిపేట నుంచి పందిరి రమణ, మువ్వల బుజ్జి, సూర్యప్రకాష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విజయ చిహ్నాన్ని చూపుతున్న విజయ్



సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్

ఓటరు జాబితాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కోటవురట్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలలని తహసిల్దారు జానకమ్మ సూచించారు. సోమవారం అమె కార్యాలయంలో మండల వ్యాప్తంగా 52 పోలింగ్ స్టేషన్ల బిఎల్ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ వారీగా సమగ్ర వివరాలు సేకరించారు. ప్రధానంగా ఆధారాలు సేకరించిన తర్వాతే తొలగించాలని, చేర్పుల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందికి సూచించారు. ఈ నెల 9వ తేదీ చేర్పులకు చివరి తేదీ అని, అర్హత కలిగిన వారందరని గుర్తించి ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, సూపర్వైజర్లు, ఉప తహసిల్దారు సోమశేఖర్, ఏవో చంద్రశేఖర్, జ్యోతి, ఉర్ధవరావు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- అనకాపల్లి : అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (నేక్) ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ యువతకు ఉపాధి కొరకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కోర్సులలో ఉచిత శిక్షణ, ఉపాధి నిమిత్తం నేరుగా దరఖాస్తులు కోరుతున్నట్లు నేక్ సహాయ సంచాలకులు రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై 15 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు వయసు కలవారై ఉండాలన్నారు. సుమారు 2 నెలలు శిక్షణా కాలం ఉంటుందని తెలిపారు. మాకవరపాలెం "నేక్" శిక్షణా కేంద్రంలో శిక్షణ, స్టేషనరీ ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధి కల్పించబడుతుందని, వివరాలకు 7780275922, 7075340910 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఘంటసాల 101వ జయంతి వేడుకలు

ప్రజాశక్తి -అనకాపల్లి: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి వేడుకలు స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల తన గానం ద్వారా మన తెలుగు జాతి కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన గొప్ప గాయకుడని తెలిపారు. ఆయన స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొని జైలు శిక్ష అనుభవించిన సమరయోధుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ సంస్థ కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వర రావు, ఘంటసాల అభిమానులు కొత్తూర్తి రామారావు, కాలెపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : కార్తీకమాసం మూడవ సోమవారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దిబ్బిడి బుచ్చయ్యపేట, నీలకరాపురం, రాజాం, సీతయ్యపేట, గున్నెంపూడి తదితర గ్రామాల్లో తెల్లవారుజాము నుండే భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాధికారి బస్సు యాత్ర వాయిదా

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాదిలో మంగళవారం నిర్వహించాల్సిన ప్రజా సాధికారి బస్సు యాత్ర వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు వైసీపీ మండల అధ్యక్షులు జోగా కొండబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు యాత్ర జరుగు వివరాలను త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-మాడుగుల: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు. సోమవారం మండలంలోని అవురువాడ పంచాయతీ పరిధిలో జరిగిన వికసిత భారత్ కార్యక్రమంలో మండల పరిషత్ విస్తరణాధికారి మీనా కుమారి పాల్గొని పథకాలను తెలియ జేశారు. ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న 18 రకాల పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కీముడు మాధవి, వెలుగు సిసి అప్పలనాయుడు, వివో రావాడ కొండబాబు, దేవుడమ్మ, సచివాలయ కన్వీనర్ తంటపరెడ్డి బన్నీ, తదితరులు పాల్గొన్నారు.




సామగ్రిని ఇస్తున్న ఎంపిడిఒ

వైసిపి పాలనలో పేదలకు సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో పేదలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వైసిపి మండల శాఖ అధ్యక్షులు దేశం శెట్టి శంకర్రావు చెప్పారు. పెదపాడు గ్రామంలో ఎపికి జగన్ ఎందుకు రావాలి అనే కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి జండా ఎగరవేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కోన బుజ్జి, దుప్పుతురు పిఎసిఎస్ అధ్యక్షులు శెట్టి నాగేష్, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

పథకాలపై ప్రచారం

ఆనందపురం: మండలంలోని తర్లువాడ పంచాయతీలో వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, స్థానిక సర్పంచ్ బిఆర్‌బి నాయుడు ఆధ్వర్యంలో ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సిఎంను చేయాలని కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, బాలి అయ్యప్ప, తదతరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నేత

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విశాఖ, అనకాపల్లిలో ఆందోళనలు



విశాఖలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు పి.మణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవేదన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అందరికి మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలుచేసి వేతనాల పెంచాలని, ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి వేతనాల పెంచాలని, రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాట్యూటీ కల్పించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, వేతనంతో కూడా మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీమ్ అమలు చేయాలని, సిఆర్ఎంటియ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ మండల లెవెల్ అకౌంటెంట్లు, మెసెంజర్, ఆర్ట్, క్రాఫ్ట్, కెజిబివి స్కూల్ టీచింగ్, నాన్ టీచింగ్, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని కోరారు. జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.గణపతి, ఎల్.చైతన్య, పి.శ్రీరామ్మూర్తి, వి.వండరీకాక్ష, పి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ సొసైటీలో 12 సంవత్సరాల నుంచి ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాలలో పని చేస్తున్న 25 వేల మంది సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. వారికి ఎఐటియుసి నాయకులు కోన లక్ష్మణ్ సంఘీభావం ప్రకటించారు. రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 3నెలలు జీతాలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసవేతనం అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పిఆర్సి పెంచాలని, మెడికల్ లీవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి వెంకట్రావు, పి.సతీష్, జి.సంతోష్ కుమార్, సిహెచ్. రామచంద్ర, జి నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నాయకులు



పర్యటిస్తున్న అధికారులు

తీర ప్రాంతాల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి -నక్కపల్లి: తుఫాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన బంగారమ్మ పేట, డిఎల్ పురం, రాజయ్యపేట తదితర తీర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో భారీ వర్షం, ఈదురు గాలులు వీచే అవకాశం ఎక్కువగా ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్ళవద్దని సూచించారు. తుఫాను కేంద్రాలను పరిశీలించారు. విఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -కొత్తకోట: తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కాలువలు, కళ్యాణపులోవ డ్యామ్ తదితర ప్రాంతాలలో చేపల వేటకు వెళ్ల వద్దని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈదురు గాలులతో కరెంట్ వైర్లు తెగిపడే అవకాశం ఉన్నందున వైర్ల వద్ద ఎవరూ సంచరించరాదన్నారు. కార్తీక మాసం సందర్భంగా వనభోజనం, విందు వినోదాల కోసం కళ్యాణపులోవ, బొమ్మాలమ్మ జోన వంటి పర్యాటక జలాశయ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాల వద్ద ఉండవద్దని సూచించారు. ఆహార పదార్థాలను ముందుగానే సమకూర్చుకోవాలని, పిల్లలను బయట తిరగకుండా తమ ఇళ్లలోనే ఉండేలాగా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితిలలో ఫోన్:100, 8332970780 కు ఫోన్ చేయాలని ఎస్ఐ లక్ష్మణ రావు తెలిపారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్

1971 యుద్ధ వీరులకు నివాళి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేవీ డే వేడుకల్లో భాగంగా, 1971 యుద్ధంతో సహా వివిధ చర్యలలో అత్యున్నత త్యాగం చేసిన సేవా సిబ్బందికి తూర్పు నావికా దళం నివాళులర్పించింది. విశాఖపట్నం బీచ్ రోడ్డులోని 'విక్టరీ ఎట్ సీ' వార్ మెమోరియల్ వద్ద తూర్పు నావికా దళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మ్ రాజేష్ పెంధార్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, నేవీ ఫౌండేషన్ వైజాగ్ చాప్టర్, వైస్ ప్రెసిడెంట్, రియర్ అడ్మిరల్ టి.సుధాకర్ (రిటైర్డ్) పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై 8 నుండి సమ్మె

ప్రజాశక్తి-దేవరాపల్లి : అంగనవాడీ వేతనాల పెంపు, గ్రాడ్యుటి, పెన్షన్ అమలు, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మె జరుగుతుందని సమ్మె నోటీసును అధికారులకు అందజేసినట్లు దేవరాపల్లి మండల అంగన్వాడి నాయకులు జి. వరలక్ష్మి, కన్నతల్లి, కోమలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని, వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు తదితర సమస్యలు అనేకమార్లు ఉన్నతాధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. 8 నుండి అంగనవాడీలో నిరవధిక సమ్మె చేయాలని సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగనవాడి యూనియన్‌లు నిర్ణయించినట్లు చెప్పారు.

ఫొటో మార్ఫింగ్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం జోన్ విదసం ఐక్యవేదిక అడ్వైజర్ నేతల నాగేశ్వరరావు ఫొటోను పోలీస్ హెచ్చరిక చెడ్డి గ్యాంగ్ దొంగల పోస్టర్‌లో మార్ఫింగ్ చేసి వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసిన వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల నర్సీపట్నం పోలీసులు పౌరరక్షణ కోసం చెడ్డి గ్యాంగ్ దొంగల ఫొటోలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారని, దీనిలో ఒక దొంగ స్థానంలో నేతల నాగేశ్వరరావు ఫొటో మార్ఫింగ్ చేసి మన నర్సీపట్నం(ఓల్డ్ అండ్ ఒరిజినల్) వాట్సాప్ గ్రూపులో గ్రూపు సభ్యులు సర్క్యులేట్ చేశారన్నారు.

ఈ సంఘటనపై అవమానం, మానసిక ఒత్తిడి వేదనకు గురైన నాగేశ్వరరావు గత నెల 15వ తేదీన నర్సీపట్నం టౌన్ పోలీసులకు గ్రూప్ అడ్మిన్ శ్రావణ్‌లపై ఫిర్యాదు చేయడం జరిగిందని, నేటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోగా బాధితుడికి కేసు పురోగతిపై సమాచారం ఇవ్వలేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి కేసు నమోదు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని జిల్లా కలెక్టర్‌లకు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



స్పందనలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వ్యవసాయ పనులపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మల్లునాయుడు పాలెం గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పనులపై అవగాహన కార్యక్రమం శ్రీకాకుళం నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం నిర్వహించారు. భాగస్వామ్య గ్రామీణ అంచనా పద్ధతిలో గ్రామ పటం వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్లి కనకరాజు, విఎఎ హేమలత, విద్యార్థులు బి.భారతి, బి. స్నేహస్రావ్యాని, ఎస్. సుప్రియ, కె. పుష్పంజలి, సిహెచ్. మాధురి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. నక్కపల్లిలో ఆమె స్వగృహంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో వాయిదా పడ్డ పాదయాత్ర ఈనెల 9వ తేదీ రాత్రి పాయకరావుపేటకు చేరుతుందన్నారు. 10న నక్కపల్లి మండలానికి పాదయాత్ర చేరుకుంటుందని, మూలపర్ర గ్రామంలో రాత్రి లోకేష్ బస చేస్తారన్నారు. 11న ఉపమాక మీదగా ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు తిమ్మాపురం చేరుకుని బహిరంగ సభలో మాట్లాడ తారన్నారు. రాత్రికి దార్లపూడి చేరుకుని బస చేస్తారని, మరుసటి రోజు ఏటికొప్పాక మీదుగా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లోకేష్ పాదయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ మండల శాఖ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గుల వితరణ

ప్రజాశక్తి. చింతపల్లి: స్థానిక చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యులు. ట్రస్ట్ చైర్మన్ దూసబోయిన రమణ ఆధ్వర్యంలో రగ్గుల వితరణకు ఆర్థిక సహాయాన్ని అందించిన డాక్టర్ అధికారి గౌతమి నాయుడు చేతుల మీదుగా చింతపల్లి బీసీ వసతి గృహంలో సుమారు 90 మంది విద్యార్థులకు రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రమణ మాట్లాడుతూ, నిరంతరం సేవే మార్గంగా తమ ట్రస్ట్ పని చేస్తుందని, దాతల సహకారంతో అనేకమంది నిర్భాగ్యులను, పేదలను ఆదుకునేందుకు తోడ్పడుతుందన్నారు. తమ ట్రస్ట్ ద్వారా నెలలో రెండు సేవా కార్యక్రమాలను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఈరెల్లి రాజేష్, జగన్ పంతులు, సత్యనారాయణ, లోవరాజు, గోవింద్, బిలాస్కర్, భాను తదితరులు పాల్గొన్నారు.



కురుస్తున్న వర్షం

వదలని వాన

ప్రజాశక్తి-కోటవురట్ల: తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి కూడా విస్తారంగా వర్షం కురుస్తోంది. తుఫాను దృష్ట్యా ఉంచుకొని మండల స్థాయి అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా కోత దశకు సిద్ధంగా ఉన్న వరి పంటపై ప్రభావం పడుతుందని రైతన్న తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తహసీల్దారు జానకమ్మ మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు. పాడి రైతులు గ్రాసం కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

కరువు మండలాలుగా గుర్తించాలి

ప్రజాశక్తి -పాయకరావుపేట: అనకాపల్లి జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జున్‌రావు కోరారు. సోమవారం స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ,కరువు భారిన పడిన ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. ప్రత్యక్ష పన్నులను ఉప సంహరించుకోవాన్నారు. ప్రభుత్వ గ్యారంటీతో రైతులు అందరికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని తెలిపారు. కరువు నివారణ చర్యలలో భాగంగా రుణాలు ఇవ్వాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి: అనకాపల్లి జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత కార్యాలయం సాక్షం అంగన్వాడీ పోషణ్ 2.0 కింద కాంట్రాక్ట్ పద్ధతిన మూడు పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. దరఖాస్తు ఫారం కొరకు వెబ్ సైట్ Id: anakapalli.ap.nic.in ని, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9440174392 సంప్రదించాలని కోరారు.